క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్‌లో అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు, ప్రజలతో క్యాన్సర్‌కు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఇచ్చోడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించాని ఈడీఎం బండి రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉమా ప్రసన్న మీసేవ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం మీసేవల ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలనే ప్రజల నుంచి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఠాకూర్ రఘువీర్‌సింగ్, మీసేవ నిర్వాహకుడు కొండ హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఇచ్చోడ: గ్రామాభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలని ఆదిలాబాద్ డీఎల్‌పీవో ధర్మారాణి అన్నారు. శనివారం ఇచ్చోడ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చౌహాన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు. గ్రామసభకు అధికారులు రాక పోవడంతో వాయిదా వేశారు.

ఐక్యతతోనే ఆలయ అభివృద్ధి

నార్నూర్: ఐక్యతతోనే ఎంపల్లి అంజనేయస్వామి ఆలయ అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ రాథోడ్ గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం గ్రామంలో గ్రామ పెద్దలు, నాయక్ రాములునాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో గ్రామస్తులు సోహన్‌సింగ్, బాబుల్, సురేశ్, సీతారాం, హరిచంద్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

నార్నూర్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గాదిగూడ ఎస్సై ఇమ్రాన్ అన్నారు. శనివారం గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో ప్రియంక, ఛాయ, అనురాధ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మొయినుద్దీన్ అడుగుజాడల్లో నడవాలి

ఎదులాపురం: కామ్రేడ్ మొయినుద్దీన్ అడుగుజాడల్లో నడవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మొయినుద్దీన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ముడుపు నళినీరెడ్డి, అరుణ్ కుమార్, కుంటాల రాములు, పొచ్చన్న, అమీనా బేగం, షబానా పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మగ్దూం మొహియుద్దీన్ జయంతిని శనివారం సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొహినుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో నాయకులు జాదవ్ అశోక్ కుమార్, మూగ శ్రీనివాస్, పుప్పాల నరేందర్, బెజ్జంకి రవీంద్ర, సత్యనారాయణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నేరడిగొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ అనిల్ అన్నారు. మండలంలోని చిన్న బుగ్గారాం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన జట్టుకు రూ.21 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సజన్ రాథోడ్, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, విలాస్, శత్రు నాయక్, రవీందర్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

జైనథ్: మండలంలోని మాండగాడ గ్రామ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండగాడ గ్రామానికి చెందిన అశోక్ బైక్‌పై కామాయి నుంచి మాండగాడ వైపు రాంగ్ రూట్‌లో వస్తున్నాడు. ఇదే క్రమంలో మహారాష్ట్రకు చెందిన విజయ్, ఉమేష్‌లు మరో బైక్‌పై ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్నాడు. ఒక్కసారిగా ఎదురుఎదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశోక్, విజయ్‌లకు గాయాలయ్యాయి.

అప్రమత్తంగా ఉండాలి

బోథ్: దొంగల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని బోథ్ పోలీసులు సూచిస్తున్నారు. శనివారం పట్నాపూర్‌లో యువకులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ విఠల్, కానిస్టేబుల్ ఆత్రం యాదవ్, న్యాయవాది పంద్రం శంకర్ పాల్గొన్నారు.





ఎడ్లపురంలో ఎములాడ పోచమ్మ

- 250 ఏళ్ల చారిత్రాత్మక క్షేత్రం
- జిల్లా కేంద్రంలోని బద్ది పోచమ్మ ఆలయం
- అభివృద్ధి చేయాలంటున్న భక్తులు

తెలంగాణలో గ్రామ దేవతలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లోని ఆలయాలకు శతాబ్దాల చరిత్ర ఉంటుంది. ఆధ్యాత్మికత పరి మళాలను వెదజల్లే ఆదిలాబాద్ జిల్లాలోనూ దేవాలయాలకు కొదవలేదు. జిల్లాలోని కొన్ని ఆలయాలు గుర్తింపు పొందగా.. మరికొన్ని వాటి ఆలయ చరిత్ర స్థల పురాణంతో ప్రాశస్త్యాన్ని చాటుకుంటాయి.
– ఆదిలాబాద్

ఆసక్తికరం.. స్థల పురాణం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకోని భక్తులు అక్కడి బద్ది పోచమ్మ ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అంతటి ప్రాశస్త్యం ఉన్న బద్ది పోచమ్మ ఆలయం ఆదిలాబాద్ పట్టణం నడిబొడ్డున సైతం ఉంది. వేములవాడ బద్ది పోచమ్మ దగ్గరికి వెళ్ల లేని భక్తులు కోసం స్వయంగా అమ్మవారి పట్టణంలో కొలువుదీరి ప్రాణ ప్రతిష్ట అ యినట్లు స్థల పురాణం పేర్కొంటోంది. గాదరి వంశానికి చెందిన రాజమ్మ అమ్మవారిని వేడుకుంటే.. తాను వేములవాడ వరకు రాలేను అని శరణు వేడితే అమ్మవారు కలలో ప్రత్యక్షం అయ్యి 'నేనే ఇక్కడికి రావాలి అనుకుంటున్నా నన్ను నిలబెట్టుకో' అని అనడంతో, ఓ చిన్న కర్ర ముక్కను తీసుకుని అమ్మవారి రూపం దర్శనమిచ్చేలా ముఖకవళికలను తీర్చి దిద్ది, ప్రతిమను వేపచెట్టు కింద పెట్టి నిత్యం పూజలు నిర్వహించింది. ఈవిధంగా సాక్షాత్తూ అమ్మవారు ప్రత్యక్షంగా కొలువుదీరి ప్రాణప్రతిష్ట అయ్యారని ప్రతీతి. అమ్మవారి దేవాలయం చరిత్ర వింటే కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు.

చెక్క విగ్రహమే..

స్థానికులు అమ్మవారిని బద్దెవ్వగా పిలుస్తారు. కాలక్రమేణా అమ్మవారి పునఃప్రతిష్ట చేసే క్రమంలో చెక్కతోనే అమ్మవారిని కొలువుదీరుస్తున్నారే తప్ప, గత 250 ఏళ్లగా రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించకపోవడం మరో విశేషం. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో శంఖం, అభయ హస్తము, మరో అనుగ్రహ హస్తముతో నాలుగు చేతులతో దర్శనమిచ్చే బద్దెవ్వతోపాటు ఆలయంలో ఎల్లమ్మ తల్లి కూడా కొలువుదీరింది.

బద్దెవ్వ బండారి ప్రాముఖ్యత

ఎవరికి ఎంత కష్టం వచ్చినా.. నష్టం వచ్చినా.. సరే అమ్మవారి స్వరూపమైన బొమ్మలపై ఉన్న బండారి (పసుపు)నీ నుదిటిపై పెట్టుకొని నోట్లో వేసుకుంటే వాళ్ల సమస్యలు, కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అమ్మవారికి మొదటి ఆదివారం ముడుపుకట్టి, తొమ్మిది ఆదివారాలు గుడి చుట్టూ నిష్ఠతో ప్రదక్షిణలు చేస్తే కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం.

నాగు పామే క్షేత్ర పాలకుడు..!

ప్రస్తుత ఆలయం ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు పెద్ద సర్పము తిరుగుతూ ఉండేదని, అది 'బద్దెవ్వ పాము' అని పిలిచేవారు. ఎవరికీ హాని చేయకుండా అప్పుడప్పుడు రాజమ్మ కాళ్లకు చుట్టుకునేదని, అంతేకాకుండా గాదరి ఆడపడుచులు నీటి కోసం బయటకు వెళితే కుటుంబంలోని చంటి బిడ్డలను ఉయ్యాలలో పడుకోబెడితే దూలము గుండా వచ్చి ఉయ్యాల ఊపేదని ఆ వంశస్తులు చెబుతారు. బద్దెవ్వ విగ్రహాలు ప్రతిష్ఠించిన స్థలం వెనక ఉండే రంధ్రం గుండా మాయమయ్యేదని, ఎన్నిసార్లు రంధ్రాన్ని మూసివేసినా తెల్లారేసరికి అక్కడ రంధ్రం ప్రత్యక్షమయ్యేదని ఆ వంశస్తురాలు అయిన నర్మద తెలిపినట్లు స్థానిక భక్తులు చెబుతుంటారు.

రాములగుట్టపై పూజలు

తాంసి: మండలంలోని పాలోది గ్రామశివారులో గుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రుల జాతరను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శనివారం యజ్ఞం, అర్చన, అభిషేకం, నవగ్రహ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఘనంగా భీమన్న దేవుడి ఉత్సవాలు



భీమన్న దేవుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో శనివారం గుండపయ్య భీమన్న దేవుడి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారం రోజుల క్రితం సిరిచెల్మ గ్రామ సమీపంలో వనదేవతలకు బోనాలు చేసి, పండుగను ప్రారంభించారు. శనివారం నాయికపోడ్ కులస్తులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి గుండపయ్య విగ్రహాన్ని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గుండపయ్య దేవుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం, సోమవారం ప్రత్యేక పూజలు చేసి ఆలయం వద్ద జాతర నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



బేల: మాట్లాడుతున్న పాయల్ శంకర్

బేల: బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కోర్టచనకా బ్యారేజ్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. అంచనా వ్యయం నాలుగింతలు పెంచుకున్నారని మండిపడ్డారు. చిట్యాల సుహాసినిరెడ్డి, ఎన్రాల నగేష్, లోక ప్రవీణ్‌రెడ్డి, బో యర్ విజయ్, దత్తా నిక్కమ్, ఠాక్రే మురళీధర్, సందీప్, పోత్రాజ్ నవీన్, కోడె ప్రదీప్, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

జైనథ్: బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండలంలోని నిరాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతమే చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, ఎన్రాల నగేష్, కట్కం రాందాస్, అస్తక్ సుభాష్, బోయర్ విజయ్, చంద్రకాంత్ చౌదరి, మోహన్, ముకుంద్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల ఇన్‌చార్జి రితేశ్ రాథోడ్ పాల్గొని పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, వాసు, రాజేశ్వర్, లింగాగౌడ్, రవి, వేషరావు, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు: రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మనోజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీకార్యకర్త గెలుపుకోసం సైనికులా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు మాధవరావు, మండల అధ్యక్షుడు స్వామి, కిరణ్, ఆశన్న, అశోక్, రవి, నవీన్, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



ప్రారంభమైన రోడ్డు పనులు

బోథ్: మండల కేంద్రం నుంచి నిగిని వరకు రోడ్డు పనులు నిలిచిపోవడంతో ఈనెల 4న 'నత్తనడకన రోడ్డు పనులు' శీర్షికతో సాక్షితో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ శనివారం పనులు ప్రారంభించారు. సోమవారం నుండి పూర్తిస్థాయిలో పనులను ప్రారంభమౌతాయని ఆర్అండ్‌బీ డీఈ సునీల్ తెలిపారు. వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నాసిరకంగా మనఊరు.. మనబడి పనులు

బేల: మనఊరు.. మన బడి పనులు నాసిరకంగా చేపడుతున్నారని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రూ.83లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఏబీవీపీ నాయకులు పరిశీలించారు. స్టీల్, సిమెంటు, ఇసుక, సిమెంటు ఇటుకలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రేసు మనోజ్‌రెడ్డి, రాపెల్లివార్ కృష్ణ, ప్రీతం, నార్లవార్ అజయ్, పవన్‌రెడ్డి, అనికేత్, జలిందర్ పాల్గొన్నారు.

'మాతా శిశువుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం'

గుడిహత్నూర్: మాతా శిశువుల ఆరోగ్య పరిరక్షణే తమ సంస్థ లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీవో వనజ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో పోషణ్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బలహీనమైన నవజాత శిశువులను గుర్తించడం, అదనపు ఆహారం అందేలా చూడడం, లోపాలు, అనారోగ్యంతో ఉన్న శిశువులకు ఆహారం ఎలా అందించాలనే అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.పద్మ, ఎస్.జయశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు

ఇచ్చోడ: గ్రామాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోకస్‌మాన్నూర్‌లో రూ. 2 లక్షల ఎంపీపీ నిధులతో పాఠశాల వద్ద కల్వర్టు నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల గంగారాం, కోకస్‌మాన్నూర్ ఎంపీటీసీ కొత్తురి సూజాత గంగయ్య, ఇచ్చోడ ఎంపీటీ శివకుమార్‌రెడ్డి, కాండ్లి రమణయ్య, నరాల శ్రీనివాస్, గోవుల వినోద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్‌ఫెస్టివల్



తినుబండారాలు విక్రయిస్తున్న చిన్నారులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థులు ఘుమఘుమలాడే వివిధ రకాల వంటకాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. మేళాను తిలకించేందుకు వచ్చిన పోషకులు, విద్యార్థులు తమ సహచరులు తయారుచేసిన ఆహారపదార్థాల రుచి చూశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్, తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మం ఎంతో గొప్పది

- ఎమ్మెల్యే జోగు రామన్న



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: భారత దేశంలో హైందవ ధర్మం ఎంతో గొప్పదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని యాపల్‌గూడలో నూతనంగా నిర్మించిన శ్రీ శివభక్త మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్, సర్పంచ్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సంబురాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. యువతకు ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, సాయికుమార్, ఖయ్యూం, రఘు, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

ఉండమ్‌లో ట్రెయినీ కలెక్టర్ పర్యటన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

తలమడుగు: గ్రామాల్లో మహిళ సంఘాల సభ్యులు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం మండలంలోని ఉండమ్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాలపై ఆరా తీశారు. వీటి ద్వారా కిరణదుకాణం, గొర్రెలు, బర్రెల కోసం రుణాలు తీసుకోవడం జరిగిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనంతరం కంటివెలుగు కార్యక్రమం, నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఏపీఎం స్వామి, సర్పంచ్ పోచ్చుబాయి, శ్రీలత, రమేశ్, ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

ఆదిలాబాద్‌టౌన్: చైల్డ్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని బాలల సంరక్షణ సమితి చైర్మన్ వెంకట స్వామి సూచించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ పాఠశాలలో ఓపెన్ హౌస్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల కోసం అమలవుతున్న చట్టాలు, వారి హక్కుల గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి కమిటీ సభ్యులు సమీర్ ఉల్లాఖాన్, దశరత్, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, షీటీం ఎస్సై సునీత, దశరథ్, ప్రిన్సిపాల్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ప్రభుత్వం భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, లింబాజీ, పాండురంగ్, కంఠేశ్వర్‌లు డిమాండ్ చేశారు. శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు బోధనను బహిష్కరిస్తూ.. కేవలం 6,7,8 తరగతులకు మాత్రమే పరిమితం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సమాచారం

రేపు పత్తి రైతుల ధర్నా

ఇచ్చోడ: అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం పత్తి రైతుల ధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలపక్షం రైతు సంఘం నాయకులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మట్లాడారు. గత రెండు నెలల క్రితం పత్తి క్వింటాల్‌కు రూ. 9 వేలు ఉండేదన్నారు. ప్రస్తుతం పత్తి ధర రూ. 7300 ఉందన్నారు. క్వింటాల్ పత్తికి రూ. పదివేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో అఖిలపక్షం నాయకులు నిమ్మల మల్లేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సంగెం బొర్రన్న, పానపట్టి మారుతి పాల్గొన్నారు.

14 నుంచి క్రికెట్ పోటీలు

బోథ్: తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి తాలుకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని లాల్‌పిచ్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల జట్లు రూ.3 వేల ఎంట్రీఫీజుతో తమ జట్ల పేరును నమోదు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

తలమడుగు: మండలంలోని లింగి, తలమడుగు, కప్పర్‌దేవి గ్రామాలో బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పరామర్శించారు. లింగి గ్రామానికి చెందిన అర్క ఆశన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకన్న యాదవ్, రాజేశ్వర్, ప్రకాష్‌రావు, గంగారాం, విట్టల్, మోహన్ పాల్గొన్నారు.

బోరుబావి ఏర్పాటు

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామంలో వీఆర్‌ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలనీ వాసులకు బోరుబావి తవ్వించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాఘ్మారే శైలేందర్ మాట్లాడారు. మాత రమామాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆమె ఆశయ సాధన కోసం మహిళలకు అండగా నిలవాలని, బోరుబావి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు దాదాసాహేబ్, ఏక్‌నాథ్, అర్జున్, శ్రీరంగ్, సుధాకర్, దయానంద్, పరమేశ్వర్, దిలీప్, ఛాయా, సునీత, నాందేవ్, రాజు పాల్గొన్నారు.

జైనథ్ అభివృద్ధి ప్రధాత జోగు రామన్న

జైనథ్: కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేని జైనథ్‌ను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే జోగు రామన్నకే దక్కుతుందని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేష్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, నాయకులు వెంకట్ రెడ్డి, జగదీష్ రెడ్డి, లస్మన్న యాదవ్, అడెల్లు, సంజీవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ ఎస్సై హరిబాబు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, అవగాహన లోపం కారణంగా చాలా మంది మోసపోతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు, ఆధార్ నంబరు, ఓటీపీ వంటి సమాచారాన్ని చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, భుజంగరావు, రాజేష్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నంబరు ప్లేట్ సరిగా లేకుంటే వాహనాలు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: వాహనాలకు నంబరు ప్లేట్ సరిగా లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని టూటౌన్ సీఐ పురుషోత్తం చారి హెచ్చరించారు. శనివారం ఆర్డీవో కార్యాలయం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో నంబరును బ్లాక్ పెయింట్ వేసి నడిపిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నంబర్‌ను మల్చడం, మాస్కులు పెట్టడం, బ్లాక్ పెయింట్ వేయడం చట్టరీత్యా నేరమన్నారు.

డీఎస్పీని కలిసిన సేవాలాల్ సేన నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఉట్నూర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నగేందర్‌ను శనివారం సేవాలాల్ సేన మహిళ జిల్లా కన్వీనర్ జాదవ్ సావిత్రి నాయక్, జిల్లా అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, భీంరావులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏజెన్సీలో శాంతిభద్రతల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

జైనథ్: ప్రజలకు కనీస వసతులు కరువై ఇబ్బంది పడుతున్నారని, ఎమ్మెల్యే జోగు రామన్న ఇకనైన ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జెడ్పీ చైర్మన్ చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. శనివారం ఆమె మండలంలోని గిమ్మ గ్రామంలో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు రాము, భగవంత్ రావ్, భూమన్న, అడెల్లు, రాజు, వినోద్, మోహన్ పాల్గొన్నారు.